సాక్షి
నిర్మల్
శనివారం । 11 । ఫిబ్రవరి । 2023



ఎన్‌సీసీ శిక్షణ.. భవిష్యత్‌కు నిచ్చెన

మామడ మండలం పొన్కల్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, ఎన్‌సీసీ అంశాల్లో రాణిస్తున్నారు.

8లో▸



ఆశ్రమ పాఠశాల వార్షికోత్సవం

విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. ఖానాపూర్‌లోని ఎస్టీ బాలికల ఆశ్రమ పాఠశాల వార్షికోత్సవంలో మాట్లాడారు.

8లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
36.3 / 16.7

వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రత రెండు మూడు డిగ్రీలు పెరుగుతుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా అనిపిస్తుంది. రాత్రి చలి ప్రభావం తగ్గుతుంది.

న్యూస్‌రీల్

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోండి



శిబిరాన్ని పరిశీలిస్తున్న హేమంత్ బోర్కడే

నర్సాపూర్(జి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ హేమంత్ బోర్కడే పేర్కొన్నారు. మండలంలోని చాక్‌పల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని శుక్రవారం సందర్శించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేసుకోవాలని సూచించారు. దృష్టి లోపాలు ఉన్న వారికి వెంటనే అద్దాలు ఇవ్వాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి నరేశ్‌కుమార్, మక్బూల్ తదితరులు ఉన్నారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం



అధికారులకు సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో

నిర్మల్‌చైన్‌గేట్: లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని భ్రూణ హత్యలు నివారించి ఆడపిల్లను రక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని డీఎంహెచ్‌వో డాక్టర్ ధనరాజ్ అన్నారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో జిల్లా అడ్వైజరీ కమిటీ(పీసీ– పీఎన్‌డీటీ యాక్ట్ 1994) సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టబోయేది ఆడ, మగ అని తెలుసుకోవడానికి లింగ నిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ సెంటర్లు ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆడపిల్లల ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో రజిని, లయన్స్‌క్లబ్ వైస్ ప్రెసిడెంట్ గంగాధర్‌గౌడ్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మంగళ, అడ్వకేట్, సామాజిక కార్యకర్త నిర్మల, డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి రవీందర్ పాల్గొన్నారు.

విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా చూడాలి

- ఎంజేపీ ఆర్‌సీవో గోపీచంద్



జవాబు పత్రాలను పరిశీలిస్తున్న గోపీచంద్

లక్ష్మణచాంద: విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా చూడాలని ఎంజేపీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్‌సీవో గోపీచంద్ అన్నారు. రాచాపూర్‌లోని మహాత్మ జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలను శుక్రవారం సందర్శించారు. ఇన్‌సెంటివ్ స్పెషల్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా పాధ్యాయులు చర్యలు చేపట్టాలని సూచించారు. పరీక్షలంటే విద్యార్థుల్లో ఉన్న భయాన్ని పోగొట్టాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాసేలాగా సన్నద్ధం చేయాలన్నారు. విద్యార్థులు రాసిన పరీక్షల జవాబు పత్రాలను, అధ్యాపకులు మూల్యాంకనం చేసిన తీరును పరిశీలించారు. విద్యార్థుల జవాబు పత్రాలను జాగ్రత్తగా మూల్యాంకనం చేయాలని సూచించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ సంతోష్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

స్పీకర్‌ను కలిసిన ముధోల్ ఎమ్మెల్యే



స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసా: శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి శుక్రవారం అసెంబ్లీలో కలిశారు. పుష్పగుచ్ఛం అందించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

తోడుకున్నోళ్లకు తోడుకున్నంత!



గోదావరిలో ఇసుక తోడుతున్న కూలీలు

జాఫ్రాపూర్ వద్ద ఇసుకను జాలి పడుతున్న కూలీలు

- జిల్లాలో జోరుగా ఇసుక దందా
- నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు
- ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న ఇసుక మాఫియా
- చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్న అధికారులు

లక్ష్మణచాంద: జిల్లాలో ఇసుక దందా జోరుగా సాగుతోంది. నదులు, వాగులు, కాలువలు దేన్నీ వదలకుండా ఇసుకాసురులు తోడేస్తున్నారు. అనుమతి లేకుండా తరలించుకుపోతున్నారు. ప్రభుత్వ ఆదా యానికి గండికొడుతున్నారు. జిల్లాలోని గోదావరి పరీవాహక ప్రాంతాలతోపాటు, వాగుల నుంచి నిత్యం వందల సంఖ్యలో ట్రాక్టర్లు, పదుల సంఖ్యలో టిప్పర్లతో ఇసుకను తరలిస్తున్నారు. అయినా అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అక్రమంగా ఇసుక తవ్వకాలు, రవాణా జరుగుతుందని తెలిసినా చూసీ చూడనట్లుగా ఉంటున్నారు.

గోదావరితోపాటు వాగుల్లో తవ్వకాలు..

జిల్లాలో గోదావరి పరీవాహక ప్రాంతాలైన బాసర, లోకేశ్వరం మండలం సుద్దవాగు పరివాహక గ్రామాలైన ఎడుదూర్ పొట్టపెల్లి, సాత్‌గామ్, అద్‌గామ్, సారంగాపూర్ మండలం స్వర్ణ వాగు పరీవాహక గ్రామాలైన మలక్‌చించోలి, వంజర్, గొడిసెర, బీరవెల్లి, దిలావర్‌పూర్ మండలంలోని వాగు పరీవాహక గ్రామాలు కాల్వ, చిట్యాల్, నిర్మల్ రూరల్ మండలం సిర్గాపూర్, సిద్దాపూర్, మంజులాపూర్, తాంష, సోన్ మండలంలో గోదావరి పరీవాహక గ్రామాలు, స్వర్ణ వాగును ఆనుకుని ఉన్న పాక్‌పట్ల, సిద్దులకుంట, జాఫ్రాపూర్, కూచన్‌పెల్లి, సోన్, లక్ష్మణచాంద మండలాల్లోని గోదావరి, కనకాపూర్ వాగు పరీవాహక గ్రామాలైన పీచర, ధర్మారం, పార్‌పెల్లి, మునిపెల్లి, చింతల్‌చాంద, కనకాపూర్, వడ్యాల్, బాబాపూర్, నర్సాపూర్, రాచాపూర్, పొట్టపెల్లి(కె), లక్ష్మణచాంద, తిర్పెల్లి, చామన్‌పెల్లి, మామడ మండలం ఆదర్శనగర్, కమల్‌కోట్, పొన్కల్, ఖానాపూర్ మండలం రాజూర, పల్కేరు వాగు, ఎర్వచింతల్, కడెంవాగు, ఖానాపూర్, బాదన్‌కుర్తి, బాబాపూర్, దిలావర్‌పూర్ గ్రామాల్లో ఇసుక లభిస్తుంది. అన్ని ప్రాంతాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు జోరుగా జరుగుతున్నాయి.



మాటెగామ్ వద్ద రిసిప్టు ఇస్తున్న వీడీసీ సభ్యుడు

ఇష్టారీతిన వీడీసీ టెండర్లు..

ప్రభుత్వం అధికారికంగా జిల్లాలో ఎక్కడా ఇసుక క్వారీకి అనుమతి ఇవ్వలేదు. ఇదే అదునుగా గోదావరితోపాటు వాగుల వెంబడి ఉన్న గ్రామాల్లో వీడీసీలు ఇసుక రవాణాకు టెండర్లు నిర్వహిస్తున్నా యి. వీడీసీలకు అధికారం లేకపోయినా అనధికారికంగా, రహస్యంగా టెండర్లు నిర్వహించి ఇసుక త వ్వకాలు, రవాణాకు అనుమతి ఇస్తున్నారు. ఇందు కు లక్షల రూపాయలు వీడీ సీల కు ముడుతు న్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తక్కువ డబ్బులు వీ డీ సీలకు ము ట్టజెప్పి అక్రమార్కులు ల క్షల రూపాయలు సంపాదిసు న్నారు.

జిల్లాలోని ఇసుక ఉన్న పలు ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలు చేస్తున్నవారు స్థానిక కూలీలతోపాటు మహారాష్ట్ర నుంచి కూలీలను తీసుకొచ్చి తవ్వకాలు చేస్తున్నారు. ఇసుకను జల్లెడ పట్టించి నది, వాగుల తీరంలో పగలు డంప్ చేయిస్తున్నారు. చీకటి పడగానే ట్రాక్టర్లు, టిప్పర్లతో జిల్లా అంతటికీ తరలిస్తున్నారు. ట్రాక్టర్ ఇసుక గ్రామ పరిధిలో అయితే రూ.3,500, టిప్పర్ ఇసుకకు రూ.15 వేలు వసూలు చేస్తున్నారు. దూరాన్ని బట్టి ధర పెరుగుతుంది.

పగలు తీరంలో డంపింగ్.. రాత్రి తరలింపు...

చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్న అధికారులు

జిల్లా అంతటా ఇసుక అక్రమ రవా ణా జరుగుతోంది. ప్రభుత్వానికి రూపాయి చెల్లించకుండా ప్రకృతి సంపదను తరలించుకుపోతున్నా మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆయా శాఖల అధికారులను ఇసుక మాఫియా మేనేజ్ చేస్తుందన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. దీంతో నిత్యం వందల సంఖ్యలో ట్రాక్టర్లలో, పదుల సంఖ్యలో టిప్పర్లలో ఇసుక తరలిస్తూ ఇసుక స్మగ్లర్లు కోట్లకు పడగలెత్తుతున్నారు. ఇప్పటికైనా మైనింగ్, పోలీస్, రెవెన్యూ అధికారులు స్పందించి ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వే యాలని ప్రకృతి సంపదను, భూగర్భ జలాలను సంరక్షించాలని జిల్లా వాసులు కోరుతున్నారు.



స్వర్ణ వాగులో ఇసుక నింపుతున్న కూలీలు

భూగర్భ జలాలకు ముప్పు..



జిల్లా అంతటా ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ఇష్టానుసారం నదులు, వాగుల్లో తవ్వకాలు చేస్తుండడంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయకు ంటే వేసవిలో నీటికి ఇబ్బందులు తప్పవు. అధికారులు ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకోవాలి. – శ్రీనివాస రావు, తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు

చర్యలు తీసుకుంటాం

జిల్లాలో గోదావరి తీర ప్రాంతంలో గానీ, వాగుల్లో గానీ ఇసుక రీచ్‌లకు అనుమతి ఇవ్వలేదు. వీడీసీలకు ఇసుక వేలం నిర్వహించే అధికారం లేదు. ఇసుకను అక్రమంగా తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. నదీ పరీవాహక గ్రామాల్లో తనిఖీలు నిర్వహిస్తాం. ఇసుక డంపులు కనిపిస్తే సీజ్ చేస్తాం. – క్రాంతి కుమార్, మైనింగ్ ఏడీ, నిర్మల్

సీఎంను కలిసిన మంత్రి, ఎమ్మెల్యేలు



కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలు

భైంసా: గిరిజనులు సాగుచేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వడంతో పాటు విద్యుత్, సాగునీరు, రైతుబంధుతోపాటు భూమిలేని గిరిజనులకు గిరిజనబంధు అమలు చేస్తామని సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటించడంపై ఉమ్మడి జిల్లా అధికార పార్టీ ఎమ్మెల్యేలు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర అటవీ, పర్యావరణశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్‌ను శుక్రవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో జెడ్పీచైర్మన్ జనార్దన్ రాథోడ్, ఎమ్మెల్యేలు జోగు రామన్న, రాథోడ్ బాపూరావు, కోనేరు కోనప్ప, ఆత్రం సక్కు, రేఖానాయక్, దుర్గం చిన్నయ్య, జి.విఠల్‌రెడ్డి తదితరులున్నారు.

బదిలీలకు దరఖాస్తు చేసుకోవాలి

నిర్మల్ రూరల్: ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల్లో భాగంగా జిల్లాలోని 317 జీవో ద్వారా జిల్లాకు బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12 నుంచి 14 వరకు రాష్ట్ర విద్యాశాఖ వెబ్‌సైట్ www.schooledu.telangana.gov.in లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారు తమ సర్వీసు పుస్తకం, తగిన ఆధారాలతో ఈనెల 14న జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో తనిఖీ(వెరిఫికేషన్) చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న కాపీని డీడీవోతో ధ్రువీకరణ చేసుకుని సర్వీస్ పుస్తకం, తగిన ఆధారాలతో ఈనెల 14న డీఈవో కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు. డీడీవో సంతకం లేని దరఖాస్తులు స్వీకరించమని స్పష్టం చేశారు.

అదనపు కలెక్టర్‌కు పదోన్నతి

- కుమురంభీం ఆసిఫాబాద్ కలెక్టర్‌గా పోస్టింగ్



హేమంత్ బోర్కడే

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ హేమంత్ బోర్కడేకు పదోన్నతి లభించింది. ఆయనను ఆసిఫా బాద్ కలెక్టర్‌గా నియమిస్తూ చీఫ్ సెక్రటరీ శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2019 బ్యాచ్‌కు చెందిన హేమంత్ జిల్లా అదనపు కలెక్టర్‌గా రెండేళ్ల ఆరు నెలల మూడు రోజులు పనిచేశారు.

నేడు ఏబీవీపీ జిల్లా సమ్మేళనం

నిర్మల్ రూరల్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ జిల్లా సమ్మేళనం శనివారం నిర్వహిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ శశిధర్ తెలిపారు. విద్యారంగ సమస్యలపై చర్చించేందుకు ఈ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9:30 గంటలకు ర్యాలీతో ప్రారంభమై మధ్యాహ్నం 1 గంటకు జిల్లా కేంద్రంలోని ఆర్కే ఫంక్షన్ హాల్‌లో సమ్మేళనం నిర్వహిస్తామని వివరించారు.

'పది' విద్యార్థులకు అల్పాహారం

- ఫిబ్రవరి 15నుంచి ఏప్రిల్ 1 వరకు స్నాక్స్
- 34 పనిదినాలకు నిధులు మంజూరు
- ఒక్కో విద్యార్థికి రూ.15 చెల్లింపు

మంచిర్యాలఅర్బన్: పదో తరగతి.. విద్యార్థి జీవితంలో ఎంతో కీలకమైంది. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధనకు ప్రత్యేక తరగతుల నిర్వహణ సాగుతోంది. ఉదయం 8.30గంటల నుంచి 9.30గంటల వరకు, సాయంత్రం 4.45గంటల నుంచి 5.45గంటల వరకు సబ్జెక్టు వారీగా బోధిస్తున్నారు. బోధించిన పాఠ్యాంశాలపై ప్రత్యేక పరీక్ష నిర్వహిస్తున్నారు. ఉదయాన్నే బడికి వచ్చే విద్యార్థులు అర్ధాకలితో సాయంత్రం వరకూ ప్రత్యేక తరగతుల్లో కూర్చోవాల్సి వస్తోంది. మధ్యాహ్న భోజనం మినహా ఇంటి నుంచి వచ్చి తిరిగి వెళ్లే వరకూ ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ, జిల్లాపరిషత్, మోడల్ స్కూళ్లలో పదో తరగతి విద్యార్థులకు స్నాక్స్ అందించేందుకు ప్రభుత్వ విద్యాశాఖ కార్యదర్శి నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. 2022–23 విద్యాసంవత్సరానికి సంబంధించి పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ 3 నుంచి 23వరకు జరగనున్నాయి. ఇందులో భాగంగా ఫిబ్రవరి 15నుంచి ఏప్రిల్ 1వరకు ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు సాయంత్రం పూట 34 పని దినాలు స్నాక్స్ అందించనున్నారు. ఒక్కో విద్యార్థికి రూ.15 చొప్పున నిర్ణయిస్తూ అవసరమైన బడ్జెట్ కేటాయించారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీల ద్వారా ఆరోగ్యకరమైన స్నాక్స్ అందించేందుకు ఏర్పాట్లు చేయాలని ఉత్తర్వులో పేర్కొన్నారు.



ఆవడం ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతిలో విద్యార్థులు

ఈ నిధులు ఒకట్రెండు రోజుల్లో పాఠశాలల యాజమాన్య కమిటీ(ఎస్‌ఎంసీ) ఖాతాల్లో జమకానున్నాయి. దీంతో విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది.

నిధులు ఇలా..

మంచిర్యాల జిల్లాలో 111 పాఠశాలల్లో 4,252మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారు. ఒక్కో విద్యార్థికి రూ.15 చొప్పున రోజుకు రూ.63,780, ఈ లెక్కనే ఆదిలాబాద్‌కు రూ.72,990, కుమురంభీంకు రూ.42,690, నిర్మల్ జిల్లాకు రూ.58,710 మంజూరుకు నిర్ణయించారు. ఇలా 34 రోజులకు గాను అవసరమైన బడ్జెట్‌ను కేటాయించారు. అదే విధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు కేటాయిస్తే బాగుంటుందని పలువురు కోరుతున్నారు. స్నాక్స్ అందించేందుకు ప్రధానోపాధ్యాయులు ఏర్పాట్లు చేసుకోవాలని, విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని మంచిర్యాల జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో నిధులు కేటాయింపు ఇలా..

జిల్లా	పాఠశాలలు	విద్యార్థులు	34రోజులకు నిధులు
ఆదిలాబాద్	112	4866	రూ.24,81,660
కుమురంభీం	58	2846	రూ.14,51,460
మంచిర్యాల	111	4252	రూ.21,68,520
నిర్మల్	117	3914	రూ.19,96,140

అభివృద్ధి పనుల్లో జాప్యం చేయొద్దు

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: అభివృద్ధి పనుల్లో జాప్యం చేయొద్దని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అధికారులకు సూచించారు. తహసీల్దార్లు, నయాబ్ తహసీల్దార్లతో కలెక్టరేట్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. అభివృద్ధి పనులు సకాలంలో పూర్తయ్యేలా చూడాలన్నారు. అంతకుముందు తహసీల్దార్లు, నయాబ్ తహసీల్దార్లను పరిచయం చేసుకున్నారు. సమస్యలు, పెండింగ్ పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లో పిల్లలకు నాణ్యమైన భోజనం అందుతుందా, పరిశుభ్రత, పచ్చదనం తనిఖీ చేయాలని సూచించారు. పిల్లలతో కలిసి భోజనం చేయాలని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాంబాబు, డీఆర్వో లోకేశ్, ఆర్డీవోలు స్రవంతి, రవికుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

ఏసీడీ ఆగిందా?

- ఈనెల బిల్లులో కనిపించని చార్జి
- సమాచారం లేదంటున్న అధికారులు

భైంసాటౌన్:విద్యుత్ వినియోగదారులకు భారంగా మారిన అదనపు విద్యుత్ వినియోగం డిపాజిట్ (ఏసీడీ)పై అయోమయం నెలకొంది. గతనెల బిల్లులో ఏసీడీ చార్జీలు రాగా, చాలామంది వినియోగదారులు బిల్లులు చెల్లించారు. కాగా, గతనెలలో చెల్లించనివారికి ఈనెల బిల్లులో ఏసీడీ చార్జీలు కనిపించడం లేదు. దీంతో ఏసీడీ చార్జీలు రద్దు చేశారా.. లేదా అనేదానిపై వినియోగదారుల్లో సందేహాలు నెలకొన్నాయి. ఈ విషయమై సంబంధిత అధికారులను వివరణ కోరితే, పైనుంచి స్పష్టమైన ఆదేశాలు లేవని చెబుతున్నారు.

300 యూనిట్లలోపువారికీ...

జిల్లాలో గతనెల విద్యుత్ బిల్లుల్లో ఏసీడీ చార్జీలు నమోదు చేశారు. గతంలో 500 యూనిట్లు పైబడి విద్యుత్ వినియోగించినవారికి మాత్రమే ఏసీడీ చార్జీలు వసూలు చేసేవారు. క్రమంగా 300 పైబడిన యూనిట్లు వాడినవారికి, ఈసారి 300లోపు యూనిట్లు వినియోగించినవారికి సైతం ఏసీడీ చార్జీలు నమోదు చేశారు. దీంతో విద్యుత్ వినియోగదారులు పెరిగిన చార్జీలతో బెంబేలెత్తుతున్నారు. చాలావరకు వినియోగదారులు ఏసీడీ చార్జీలతో సహా బిల్లులు చెల్లించారు. మరికొంత మంది మాత్రం బిల్లులు చెల్లించనివారు ఉన్నారు. కాగా, ఈనెల బిల్లులో ఏసీడీ చార్జీలు కనిపించకపోవడంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఇదివరకే బిల్లులు చెల్లించినవారు తమ మొత్తం వచ్చే నెల బిల్లులో సర్దుబాటు చేసుకుంటారో లేదోనని సందేహం వ్యక్తం చేస్తున్నారు.

ఆందోళనతో ఆపేశారా?

విద్యుత్తు ఎక్కువ వినియోగించారంటూ అదనపు బాదుడుకు తెరలేపిన పంపిణీ సంస్థలు ప్రజా వ్యతిరేకత ముందు తలవంచాయి. సాధారణ నివాసాల్లో గతేడాదిలో వాడకంపై అదనపు వినియోగ ధరావతు (ఏసీడీ) పేరిట 2023 జనవరి బిల్లులో చార్జిని విధించాయి. అధిక వాడకం ఉన్న బిల్లులపై ఒక్కొక్కరికి రూ.వందల నుంచి రూ.వేలల్లో భారం పడింది. ప్రజలు గగ్గోలు పెట్టారు. దీనిపై రాజకీయ పార్టీలు, ప్రజాసం ఘాలు, ప్రజల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది. ఏసీడీని విరమించుకో వాలంటూ విద్యుత్తు రెగ్యులేటరీ కమిషన్‌కు విజ్ఞప్తులు అందాయి. ఈ నేపథ్యంలో స్పందించిన సీఎండీ 300 యూనిట్లలోపు వినియోగించే కనెక్షన్లకు అదనపు చార్జీని విధించొద్దని మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. అయితే ఈచార్జీని తర్వాత వసూలు చేయాలా లేదా పూర్తిస్థాయిలో పక్కనపెట్టాలా అనే అంశం ప్రభుత్వం, పంపిణీ సంస్థల తదుపరి నిర్ణయానికి అనుగుణంగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



ఏసీడీ చార్జి లేకుండా వచ్చిన ఫిబ్రవరి నెల బిల్లు

స్పష్టత లేదు...

జనవరిలో విద్యుత్ బిల్లుల్లో వినియోగదారులకు ఏసీడీ చార్జీలు నమోదు చేశాం. చాలామంది బిల్లులు చెల్లించారు. కాగా, ఈనెల కూడా విద్యుత్ బిల్లులు నమోదు చేస్తున్నాం. ఏసీడీ చార్జీలపై ఉన్నతాధికారుల నుంచి రెండు, మూడురోజుల్లో స్పష్టత వస్తుంది. – సుదర్శన్‌రావు, సీనియర్ అకౌంట్స్ అధికారి, నిర్మల్

క్లుప్తంగా

అంబులెన్స్ అందుబాటులోకి తేవాలి



వినతిపత్రం అందజేస్తున్న రూపేశ్‌రెడ్డి

కైలాస్‌నగర్: మృతదేహాలను ఇంటికి చేర్చేందుకు ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన అంబులెన్స్‌ను డీజిల్ లేదనే కారణంతో మూలనపడేశారని యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ జనరల్ సెక్రటరీ సామ రూపేశ్‌రెడ్డి ఆరోపించారు. అంబులెన్స్‌లో డీజిల్ ఉంచేలా చూడాలని కోరుతూ శుక్రవారం ఆయన కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. దీనిపై రిమ్స్ డైరెక్టర్, డీఎంహెచ్‌వోలను కలువగా ఆ వాహనం తమ పరిధిలో లేదంటూ చేతులెత్తేస్తున్నారని పేర్కొన్నారు. వెంటనే అంబులెన్స్‌ను అందుబాటులోకి తేవాలని కోరారు. ఆయన వెంట ముత్యాల సురేశ్ తదితరులున్నారు.

చెక్‌పోస్ట్ ధ్వంసం చేసిన 15మందిపై కేసు

కడెం: మండలంలోని పాండ్వపూర్ గ్రామ సమీపంలోని అటవీశాఖ చెక్‌పోస్టును ధ్వంసం చేసిన వారిపై నాన్‌బెయిలెబుల్ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై కొసన రాజు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 8న రాత్రి చెక్‌పోస్ట్ వద్ద జరిగిన ప్రమాదానికి అటవీ అధికారులే కారణమంటూ గ్రామానికి చెందిన 15 మంది యువకులు అటవీశాఖ కార్యాలయం, కంప్యూటర్, సీసీ కెమెరా, సోలార్ సిస్టం తదితర రూ.3లక్షల విలువైన సామగ్రి ధ్వంసం చేశారని అటవీశాఖ అధికారుల ఫిర్యాదు మేరకు వారిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య



రాజేందర్ (ఫైల్)

తాంసి: మద్యానికి బానిసై ఉరేసుకొని ఒకరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కప్పర్ల గ్రామానికి చెందిన మామిడి రాజేందర్ (40) ప్రైవేట్ బస్సు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. గురువారం రాత్రి మద్యం మత్తులో గ్రామ సమీపంలోని పంటచేనులో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్తులు, కుటుంబసభ్యుల సమాచారం మేరకు ఎస్‌హెచ్‌వో గణపతి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పంచనామా అనంతరం పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. మృతుడి భార్య సువర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. కాగా, రాజేందర్ కుమారుడు సాయికుమార్ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు.

పార్కింగ్ స్థలం నుంచి ద్విచక్ర వాహనం చోరీ

ఎదులాపురం: ద్విచక్ర వాహనం చోరీ ఘటన టూ టౌన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై విష్ణు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని కైలాస్‌నగర్‌కు చెందిన మహ్మద్ షాబాజ్ అలీ ఈనెల 5న రాత్రి 7 గంటల ప్రాంతంలో ఆర్టీసీ పార్కింగ్ స్థలంలో ద్విచక్రవాహనాన్ని పార్కింగ్ చేసి ఇచ్చోడకు వెళ్లాడు. 6న తిరిగి వచ్చి చూస్తే వాహనం లేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై తెలిపారు.

ఎన్‌సీసీ శిక్షణ.. భవిష్యత్‌కు నిచ్చెన



ఎన్‌సీసీలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు (ఫైల్)

- 2015లోనే పొన్కల్ జెడ్పీ హైస్కూల్‌కు యూనిట్ మంజూరు
- బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకుంటున్న విద్యార్థులు



జిల్లా కేంద్రంలో నృత్య ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు (ఫైల్)

మామడ: విద్యార్థులకు చదువుతోపాటు క్రీడల్లో ప్రోత్సాహాన్నిస్తే వారిలో దాగి ఉన్న ప్రతిభను బయటకు తీయవచ్చు. మండలంలోని పొన్కల్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో దాదాపు 600 మంది విద్యార్థులు చదువుతున్నారు. జిల్లాలోనే ఎక్కువ మంది ఉన్న పాఠశాలల్లో ఇది ద్వితీయ స్థానంలో ఉంది. 2015లో ఈ పాఠశాలకు ఎన్‌సీసీ యూనిట్ మంజూరు కాగా పాఠశాల దశ మారింది. గ్రామ విద్యాభివృద్ధి కమిటీతోపాటు గ్రామస్తులు సహకారం అందిస్తుండడం, ఉపాధ్యాయుల సూచనలతో విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, ఎన్‌సీసీ అంశాల్లో రాణిస్తున్నారు. లభిస్తున్న అవకాశాలను సద్వి ని యోగం చేసుకుంటూ పాఠశాలకు గుర్తింపు తెస్తున్నారు.

ఎన్‌సీసీతో అవకాశాలు

పాఠశాలలో 100 మంది విద్యార్థులు ఎన్‌సీసీలో శిక్షణ పొందుతున్నారు. ప్రతీ సంవత్సరం 50 మంది బాలికలు, 50 మంది బాలురు శిక్షణకు ఎంపికవుతున్నారు. ఈ ఏడాది పదో తరగతి పూర్తి చేసిన సాయికిరణ్ అనే విద్యార్థి ఎన్‌సీసీ కోటాలో బాసర ట్రిపుల్ ఐటీలో సీటు పొందాడు. ఇదే పాఠశాలకు చెందిన రక్షిత, శ్రీనిష్క ఎన్‌సీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక క్యాంపులో బంగారు పతకాలు సాధించి పలువురి అభినందనలు పొందారు. ఇక్కడ శిక్షణ పొందుతున్న విద్యార్థులకు ఉన్నత విద్యను అభ్యసించేందుకు ప్రత్యేక కోటాలో సీట్లు సాధిస్తున్నారు. పాఠశాల స్థాయిలో శిక్షణ పొందిన విద్యార్థులకు సమీపంలోని జూనియర్ కళాశాలల్లో ఎన్‌సీసీ లేక పోవడంతో 'ఏ' సర్టిఫికెట్‌తోనే సరిపెట్టుకుంటున్నారు. ఇంటర్, డిగ్రీలో ఎన్‌సీసీలో చేరే అవకాశాన్ని కోల్పోతున్నామని వాపోతున్నారు. మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో యూనిట్ ఉంటే మరిన్ని అవకాశాలు వస్తాయని చెబుతున్నారు.

క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో..

ఈ పాఠశాల విద్యార్థులు క్రీడలు, సాంస్కృతిక అంశాల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణిస్తున్నారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు నచ్చేందర్ శిక్షణతో కబడ్డీ, ఖోఖో లాంటి క్రీడాంశాల్లో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫేర్ సందర్భంగా ఈ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నృత్యప్రదర్శన పలువురిని ఆకట్టుకోవడంతో అధికారుల నుంచి ప్రత్యేక అభినందనలు అందుకున్నారు.

ట్రిపుల్‌ఐటీలో సీటు సాధించాను



నేను పదోతరగతి వరకు పొన్కల్ పాఠశాలలో చదువుకున్నాను. ఎన్‌సీసీలో శిక్షణ తీసుకునే అవకాశం లభించింది. అందులో చేరగా గుర్తింపు వచ్చింది. బాసర్‌ట్రిపుల్ ఐటీలో ఎన్‌సీసీ కోటాలో సీటు లభించడంతో అక్కడ చదువుకునే అవకాశం దక్కింది.
– సాయికిరణ్

లోక్ అదాలత్ ద్వారా బాధితులకు న్యాయం



కోర్టు వద్ద హర్షం వ్యక్తం చేస్తున్న బాధితులు

ఖానాపూర్: మండలంలోని బావాపూర్(కే)తో పాటు పట్టణానికి చెందిన పలువురు యువకులు గల్ఫ్‌దేశాలకు వెళ్లేందుకు జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం బొమ్మెన గ్రామానికి చెందిన తాటికొండ రంజిత్ అనే ఏజెంట్‌ను నమ్మి మోసపోయిన ఘటన ఏడేళ్ల క్రితం చోటు చేసుకుంది. అప్పట్లో ఏడుగురు బాధితులు గల్ఫ్ దేశాలకు వెళ్లేందుకు ఓ ఏజెంట్‌ను నమ్మి అంతా కలిసి రూ.10 లక్షలు వీసాల నిమిత్తం చెల్లించారు. తదనంతరం వీసాలు రాకపోవడంతో ఏజెంట్‌తో మోసపోయామని ఆందోళన చెందారు. దీంతో బాధితులు రంజిత్‌పై ఒత్తిడి తేవడంతో అతడు అప్పట్లో కొద్దిరోజులు పరారీలో ఉన్నాడు. ఈ క్రమంలో బాధితులు 2016లో ఖానాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసుల విచారణ సమయంలో కేరళకు చెందిన మరో గల్ఫ్ ఏజెంట్ పాత్ర ఉన్నట్లు వెలుగులోకి వచ్చింది. బాధితులు ఏజెంట్ రంజిత్‌కు డబ్బులు ఇవ్వగా, రంజిత్ వాటిని కేరళకు చెందిన మరో ఏజెంట్‌కు చెల్లించినట్లు విచారణలో తెలిసింది. కేసు నమోదై నేటి వరకు కోర్టులో విచారణ కొనసాగుతోంది. శుక్రవారం రంజిత్ తండ్రి హన్మంతు ద్వారా బాధితులకు తిరిగి రూ.10 లక్షలు చెల్లించారు. పోయిన డబ్బులు తిరిగిరావడంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అనంతరం ఖానాపూర్ కోర్టులో జూనియర్ సివిల్ జడ్జి ఆధ్వర్యంలో జరిగిన లోక్ అదాలత్‌లో కేసుపై ఇరుపక్షాలు రాజీపడ్డారు.

వరి క్షేత్రాన్ని సందర్శించిన శాస్త్రవేత్త



వరి పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త

ముథోల్: మండలంలోని విఠోలి గ్రామంలో వరి క్షేత్రాన్ని ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ కార్తీక్, ఏఈవో సిరాజ్‌తో శుక్రవారం సందర్శించారు. వరిలో కాండం తొలిచే పురుగు, మొగి పురుగును గమనించారు. రైతులకు ప్రస్తుత పరిస్థితులతో మొగి పురుగు నివారణకు చేట్టాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. వరి నాటిన 15 నుంచి 20 రోజుల్లో ఎకరాకు 8 కిలోల కారటాప్ హైడ్రోక్లోరైడ్ లేదా 10 కిలోల కాక్టర్ ఫ్యూరాస్ గుళికలు, 4 కిలోల క్లోరాంత్రి నిలిప్రోల్ గుళికలు వేసుకోవాలని సూచించారు. పంట ఎదిగి ఉన్నట్లయితే 400 గ్రాముల కారటప్ హైడ్రోక్లోరైడ్ 50 శాతం, ఎస్పీ లేదా 60 మిల్లీ లీటర్ల క్లోరాంత్రి నిలిప్రోల్ ఎకరానికి పిచికారీ చేయాలని సూచించారు. వారివెంట కిరణ్, అనిల్, రైతులు ఉన్నారు.

నేడు నవోదయ ప్రవేశ పరీక్ష

కాగజ్‌నగర్ రూరల్: జవహర్ నవోదయ విద్యాలయంలో 9వ తరగతిలో ఖాళీ సీట్ల భర్తీ కోసం శనివారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ చక్రపాణి తెలిపారు. ఖాళీగా ఉన్న ఐదు సీట్ల భర్తీ కోసం 994 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, వీరి కోసం రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జవహర్ నవోదయ విద్యాలయంలో హాల్‌టికెట్ నంబర్ 270850 నుంచి 271377 వరకు, సెయింట్ క్లారిటీ పాఠశాలలో హాల్ టికెట్ నంబర్ 271378 నుంచి 271843 వరకు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకల్లా విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, 11 గంటలకు కేంద్రంలోపలికి అనుమతిస్తారని పే ర్కొన్నారు. ఉదయం 11.15 గంటల నుంచి మధ్యాహ్నం 1.45 గంటల వరకు పరీక్ష ఉంటుందని వివరించారు.

దొడర్నాలో 'వన దర్శిని'



అడవిపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారి జాదవ్. కోటేశ్

కుభీర్: మండలంలోని దొడర్నా అడవిలో అటవీశాఖ వారు వన దర్శిని కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. దొడర్నా ఆశ్రమ పాఠశాల విద్యార్థులను అడవిలోకి తీసుకెళ్లి అడవుల రక్షణకు చేపడుతున్న కార్యక్రమాలు, అడవిలో చెక్‌డ్యాంలు, పర్కులేషన్ ట్యాంకుల నిర్మాణం, కందకాల తవ్వకం ప్రత్యక్షంగా చూపుతూ వివరించారు. అడవులతో మానవాళికి కలిగే ఉపయోగం, పర్యావరణ పరిరక్షణ గురించి సెక్షన్ ఆఫీసర్ జాదవ్ కోటేశ్ తెలిపారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ గంగారాం, ఉపాధ్యాయుడు నరేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

యువకుడి మిస్సింగ్



దిలీప్ (ఫైల్)

కుభీర్: మండలంలోని పాంగ్ర గ్రామానికి చెందిన నామత్కర్ దిలీప్ (24) ఈ నెల 8వ తేదీ నుంచి అదృశ్యమైనట్లు అతడి తల్లి సావిత్రా బాయి శుక్రవారం కుభీర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం 11గంటలకు చేనుకు పోతానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన దిలీప్ సాయంత్రం వరకూ తిరిగి రాలేదు. దీంతో చేను, బంధువుల ఇండ్లు, ఇతర గ్రామాల్లో వెతికినా ఆచూకీ దొరకలేదు. ఎవరికైనా ఇతడి ఆచూకీ తెలిస్తే కుభీర్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్సై సూచించారు. కాగా, దిలీప్‌కు పెండ్లి కాలేదు.

'ఆరె మరాఠాలను ఓబీసీలో చేర్చాలి'



జాతీయ బీసీ కమిషన్ చైర్మన్‌తో మాట్లాడుతున్న నాయకులు

భైంసాటౌన్: ఆరె మరాఠాలను ఓబీసీ జాబితాలో చేర్చాలని భారతీయ మరాఠా మహాసంఘ్ తెలంగాణ నాయకులు కోరారు. ఈ మేరకు ఢిల్లీలో జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హంసరాజును కలిసి విన్నవించినట్లు సంఘం రాష్ట్ర యువ అధ్యక్షుడు భోస్లే బాజీరావు తెలిపారు. దీనికి స్పందించిన హంసరాజు పార్లమెంట్లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

ప్రీవెడ్డింగ్ షూట్ స్థలాన్వేషణ ప్రాణం తీసింది..!



మృతుడి వివరాలు సేకరిస్తున్న ఎస్సై రామకృష్ణ

- మరో 11రోజుల్లో పెళ్లి
- తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదం
- యువకుడు దుర్మరణం



రమేశ్ (ఫైల్)

జైపూర్: ప్రీవెడ్డింగ్ షూట్ ఇప్పుడు సర్వసాధారణంగా మారింది. కానీ.. షూట్ కోసం స్థలాన్వేషణ కాబోయే పెళ్లికొడుకు ప్రాణం తీసింది. మరో పదకొండు రోజుల్లో పెళ్లి జరగాల్సి ఉండగా రోడ్డు ప్ర మాదం రూపంలో సింగరేణి కార్మికుడు రమేశ్(32)ను మృత్యువు కబళించింది. పెళ్లి డప్పు మోగాల్సిన ఆ ఇంట చావు డప్పు మోగింది. ఎస్సై రామకృష్ణ, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ పట్టణంలోని పో చమ్మ బస్తీకి చెందిన మోరే ప్రమీల, రాజయ్య దంపతులకు ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. ముగ్గురు కూతుళ్లకు వివాహమైంది. కుమారుడు రమేశ్ తన తండ్రి రాజయ్య సింగరేణి ఉద్యోగంలో కారుణ్య నియామకం ద్వారా చేరాడు. ఆర్కే 7గనిలో పని చేస్తున్నాడు. గోదావరిఖనికి చెందిన యువతితో వివాహం నిశ్చయమైంది. ఈ నెల 22న పెళ్లి జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ప్రీవెడ్డింగ్ షూట్ కోసం గోదావరిఖని చుట్టుపక్కల ప్రాంతాలను చూ డడం కోసం రమేశ్ మోటార్‌సైకిల్‌పై తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో జైపూర్ మండలంలోని ర్యాల-చెన్నూర్ 63వ నంబరు జాతీయ రహదారిపై ఇందారం క్రాస్ రోడ్డు సమీపంలో ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేస్తుండగా మోటార్‌సైకిల్ అదుపు తప్పి రోడ్డు పక్కన నిలిపి ఉంచిన మరో లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో రమేశ్ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబంలో తీరని విషాదం చోటుచేసుకుంది. సంఘటన స్థలాన్ని స్థానిక ఎస్సై రామకృష్ణ పరిశీలించారు.

ఇండస్ట్రియల్ టూర్‌కు ఆర్జీయూకేటీ విద్యార్థులు



గాయత్రి షుగర్ ఫ్యాక్టరీని సందర్శిస్తున్న విద్యార్థులు

భైంసా: బాసర ఆర్జీయూకేటీ కెమికల్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ మూడో సంవత్సరం విద్యార్థులు ఇండస్ట్రియల్ టూర్‌కు వెళ్లారు. కామారెడ్డి జిల్లాలోని అడ్లూరు ఎల్లారెడ్డి యూనిట్‌లోగల గాయత్రి షుగర్ ఇండస్ట్రీని శుక్రవారం సందర్శించారు. కర్మాగారంలోని చక్కెర ఉత్పత్తి ప్రక్రియ, బెల్లం తయారీ విధానం, ఆల్కహాల్ ఉత్పత్తి పద్ధతులు, పరిశ్రమలోని వ్యర్థాల నుంచి ఎరువు, కాగితం తయారీ, విద్యుదుత్పత్తి తదితర అంశాల గురించి తెలుసుకున్నారు. చెరుకు సాగు వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ, డైరెక్టర్ సతీశ్‌కుమార్ మాట్లాడారు. ఇంజినీరింగ్ విద్యార్థులకు ఇలాంటి టూర్లు ప్రయోజనకరంగా ఉంటాయని చెప్పారు. కెమికల్ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ రవికుమార్‌గౌడ్, టూర్ కోఆర్డినేటర్ శ్రీకాంత్ కుట్ల, ఆర్గనైజర్స్ హరిబాబు, సృజన, బానోతు హరిత, వినయ్‌కుమార్, విశాల్, సుదర్శన్ ఉన్నారు.

ఆదివాసీలపై కేసీఆర్‌ది కపట ప్రేమ

- పోడు పట్టాలివ్వకుంటే సత్తా చూపిస్తాం
- ఎంపీ సోయం బాపూరావు
- సీఎం వ్యాఖ్యలపై మండిపాటు



సోయం బాపూరావు

ఆదిలాబాద్: సీఎం కేసీఆర్ ఆదివాసీలపై కపట ప్రేమ కనబరుస్తున్నారని ఎంపీ సోయం బాపూరావు ఓ ప్రకటనలో మండిపడ్డారు. సీఎం కేసీఆర్ శుక్రవారం పోడు భూములపై అసెంబ్లీలో చేసిన ప్రకటన, గిరిజనులపై చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో సాగులో ఉన్న పోడు భూములకు పట్టాలు ఇవ్వకుండా ఆదివాసీలను కించపరిచే విధంగా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ముందు నుంచీ కేసీఆర్ ఆదివాసీలను మోసం చేస్తూనే ఉన్నారని ఆరోపించారు. పోడు భూముల కోసం సర్వే, దరఖాస్తుల పేరిట నాటకమాడి ఇప్పుడు అటవీ భూములు ఆక్రమించుకుంటున్నారని నిందలు మోపడం సరికాదని సూచించారు. కేసీఆర్ మరో నిజాం రజాకార్‌లా వ్యవహరిస్తూ అడవి బిడ్డలైన ఆదివాసీలపై విషం కక్కుతున్నారని విమర్శించారు. భారత రాజ్యాంగంపై సీఎంకు కనీస అవగాహన లేకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. భారత స్వాతంత్య్రం అనంతరం రాజ్యాంగంలో అడవులను నమ్ముకుని జీవిస్తున్న ఆదివాసీలకు 5, 6 షెడ్యూల్ ప్రకారం స్వయం ప్రతిపత్తి పూర్తి అధికారాలు చెల్లుబాటు అవుతాయని తెలిపారు. తెలంగాణ ఉద్యమం పేరుతో అధికారంలోకి వచ్చి ఆదివాసీ చట్టాలపై అవగాహన లేకుండా మాట్లాడడం తగదని సూచించారు. కుమరం భీం స్ఫూర్తితో ఆదివాసీలు బీఆర్ఎస్ ప్రభుత్వంపై మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగం ప్రకారం తమ హక్కులను సాధించుకుంటామని, అటవీశాఖ, పోలీస్ అధికారుల అణచివేతను ఇక సహించబోమని తెలిపారు. అన్ని రంగాల్లో వెనుకబడ్డ ఆదివాసీలపై సీఎం అసెంబ్లీ సాక్షిగా అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఖమ్మం జిల్లాలో అటవీ రేంజ్ అధికారి గుత్తి కోయలపై దుర్మార్గంగా ప్రవర్తించాడని, అటవీ అధికారి దురాగతాలను గుత్తి కోయలు భరిస్తూ వచ్చారని పేర్కొన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం గుత్తికోయలు ఎక్కడైనా నివసించే హక్కు ఉందని, ముఖ్యమంత్రి కనీస అవగాహన లేకుండా మాట్లాడడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. సీఎం భేషరతుగా క్షమాపణ చెప్పి అర్హులైన ఆదివాసీలకు పోడు పట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే తమ సత్తా ఏంటో చూపిస్తామని, ఏజెన్సీ నోటిఫైడ్ ప్రాంతాల్లో అడుగు పెట్టనివ్వమని హెచ్చరించారు.

తెలంగాణలో నిరంకుశ పాలన

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండెల లక్ష్మీనారాయణ
- రాజూరలో 'ప్రజాగోస–బీజేపీ భరోసా'



రాజూరలో మాట్లాడుతున్న యెండెల లక్ష్మీనారాయణ

లోకేశ్వరం: తొమ్మిదేళ్లుగా తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిరంకుశ, అవినీతి కుటుంబ పాలన సాగిస్తోందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే యెండెల లక్ష్మీనారాయణ ఆరోపించారు. శుక్రవారం మండలంలోని రాజూర గ్రామంలో «ప్రజాగోస–బీజేపీ భరోసా» కార్నర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సీఎం కేసీఆర్ తుంగలో తొక్కి అబద్ధాలు, మాయమాటలతో ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ కోసం పోరాటం చేసిన ఉద్యమకారుల ఆశయాలను నట్టేట ముంచారని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.కోట్ల నిధులిస్తున్నా ఏమీ ఇవ్వడం లేదని ప్రజల్లో విషం నింపే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, కేంద్రం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రధాని నరేంద్రమోదీ మార్గదర్శకం గురించి వివరించారు. ముథోల్ నియోజకవర్గంలోని సమస్యలు ప్రస్తావించారు. కేసీఆర్ నిరంకుశ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు పడకంటి రమాదేవి, అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, కన్వీనర్ సుమన్‌కుమార్, మండలాధ్యక్షుడు గంగాధర్, జిల్లా కార్యదర్శి నల్ల రమేశ్, నాయకులు రాజేశ్వర్, అనిల్, భోజన్న తదితరులున్నారు.

ఘనంగా ఆశ్రమ పాఠశాల వార్షికోత్సవం



వేదికపై విద్యార్థులతో కలెక్టర్

ఖానాపూర్: విద్యార్థి, బాల్య దశనుంచి వచ్చే ప్రతీ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని కలెక్టర్ కే అరుణ్‌రెడ్డి సూచించారు. శుక్రవారం పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీలో గల ఎస్టీ బాలికల ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన వార్షికోత్సవానికి హాజరై మాట్లాడారు. పిల్లల్లో ఉత్సాహాన్ని పెంపొందించేందుకు అన్నిచోట్ల ఈ కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను అన్ని రంగాల్లో ప్రోత్సహించడంతో పాటు విధిగా పాఠశాలలకు పంపాలన్నారు. ప్రతి ఒక్కరూ నిరుత్సాహపడకుండా కష్టపడే తత్వం పెంపొందించుకుంటే ఫలితాలు వాటంత అవే వస్తాయన్నారు. ఈసందర్భంగా ఇది వరకు పనిచేసిన హెచ్‌ఎంలు మీరాబాయి, గంగాధర్, సదానందం, రాజేశ్వర్‌ను శాలువాలతో సన్మానించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో టీజీవో జిల్లా అధ్యక్షుడు అజ్మీరా శ్యాంనాయక్, నాయకులు షబ్బీర్ పాషా, రామునాయక్, చిన్నం సత్యం, ప్రదీప్, హెచ్‌ఎం ముక్క రాజేశ్వర్ తదితరులున్నారు.

'డబుల్' వార్డు సభలను పరిశీలించిన అదనపు కలెక్టర్



వార్డు సభలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్

ఖానాపూర్: డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో నుంచి తాత్కాలిక అర్హత, అనర్హత జాబితా ప్రదర్శనకు పట్టణంలోని పలు వార్డుల్లో శుక్రవారం సభలు నిర్వహించారు. అదనపు కలెక్టర్ రాంబాబు ఈ సభలను సందర్శించారు. నిబంధనల మేరకు అర్హులకే ఇళ్లు పంపిణీ చేస్తామని తెలిపారు. జాబితాలో పేరురాని వారు ఎవరైనా ఉంటే ఈ సభల్లో తిరిగి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట చైర్మన్ అంకం రాజేందర్, వైస్ చైర్మన్ ఖలీల్, కౌన్సిలర్లు, నాయకులు కావలి సంతోష్, కారింగుల సుమన్, జన్నారపు శంకర్, నాయిని సంతోష్, పరిమి సురేశ్, అమానుల్లాఖాన్, కిశోర్‌నాయక్, తొంటి శ్రీనివాస్, చిన్నం సత్యం, షబ్బీర్‌పాషా తదితరులు ఉన్నారు.

వార్డు సభల్లో 492 దరఖాస్తులు..

పట్టణంలోని 12 వార్డుల్లో జరిగిన సభల్లో 492 మంది శుక్రవారం కొత్తగా దరఖాస్తు చేసుకున్నారని నోడల్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆయా వార్డుల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్లకు తాత్కాలిక అర్హత సాధించని 456 మంది తిరిగి దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. 36 మంది లబ్ధిదారులపై అభ్యంతరాలు వచ్చాయన్నారు. పూర్తి వివరాలను సంబంధిత అధికారులకు సమర్పిస్తామని పేర్కొన్నారు. ఏఈ తిరుపతి, ప్రత్యేక అధికారులు మల్లేశ్, లింబాద్రి, చంద్రశేఖర్, భోజారావు పాల్గొన్నారు.